# ఇక్కడ కూర్చోండి.. అప్పుడు తెలుస్తుంది!

- మేం ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో
- దయచేసి మమ్మల్ని శాసించొద్దు
- న్యాయవాదులపై సీజేఐ ఆగ్రహం
- పిటిషన్లపై ముందస్తు విచారణ చేపట్టాలనడంపై తీవ్ర అసహనం

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టులో పలువురు న్యాయవాదుల వైఖరిపై భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. కేసులకు సంబంధించి న్యాయమూర్తులపై పడుతున్న ఒత్తిడిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఒకింత భావోద్వేగానికి గురైన సీజేఐ.. ఒక్కరోజు తమ స్థానంలో కూర్చుంటే ఆ ఒత్తిడేంటో తెలుస్తుందంటూ న్యాయవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిటిషన్‌పై ముందుగా విచారణ చేపట్టాలన్న ఓ అభ్యర్థనపై ఈ మేరకు మంగళవారం సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



### సీజేఐ ఏమన్నారంటే?

'తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని ప్రతీ ఒక్కరూ కోరుతున్నారు. అయితే, న్యాయమూర్తుల మీద ఉన్న పని ఒత్తిడిని ఎవరైనా పట్టించుకొంటున్నారా? మీరు (న్యాయవాదులు) ఒక రోజు జడ్జీల స్థానంలో కూర్చుంటే.. మేం ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో అప్పుడు అర్థమవుతుంది. మీరు వచ్చి ఇక్కడ ఎందుకు కూర్చోకూడదు? దయచేసి వచ్చి కూర్చోండి. మీ పిటిషన్లను ఎప్పుడు విచారించాలి అనేది కూడా మీరే నిర్ణయించండి. మీరు ఒక్కసారి మా స్థానంలో కూర్చొని చూడండి.. జీవితంలో మళ్లీ ఎప్పుడూ ఇక్కడ కూర్చోవాలనుకోరు. ఇది నేను కచ్చితంగా చెప్తున్నాను. అయినా.. మీ ప్రవర్తన మీకైనా అతిగా అనిపించట్లేదా? మేము ప్రతిఒక్క పిటిషన్‌పై విచారణ జరుపుతాం. దానికి ఒక తేదీని కూడా నిర్ణయిస్తాం. కోర్టులు, న్యాయమూర్తులపై ఉన్న పని ఒత్తిడిని ఇప్పటికైనా అర్థం చేసుకోండి. అంతేగానీ, మమ్మల్ని దయచేసి శాసించొద్దు' అని సీజేఐ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### సీజేఐ ఆగ్రహానికి కారణమేంటంటే?

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై అనర్హత వేసేందుకు స్పీకర్ రాహుల్ నార్వేకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ శివసేన (యూబీటీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాని విచారణ మంగళవారం బెంచీ ముందుకు వచ్చింది. అయితే, మిగతా పిటిషన్ల విచారణ ఆలస్యం అవుతుండటంతో.. దీనిపై జోక్యం చేసుకొన్న శివసేన (యూబీటీ) తరుపు న్యాయవాదులు.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీనిపై ముందస్తు విచారణ చేపట్టాలని ధర్మాసనానికి అభ్యర్థించారు. అయితే, దీనికి సంబంధించిన పత్రాలు అందించేందుకు సమయం కావాలని ప్రతివాదులు ధర్మాసనాన్ని కోరారు. దీంతో పిటిషన్‌ను కోర్టు గురువారానికి వాయిదా వేసింది. అయితే, ఈ వాయిదాపై పిటిషనర్ తరపు న్యాయవాద బృందం అభ్యంతరం వ్యక్తంచేసింది. అంతకంటే ముందుగానే పిటిషన్‌ను విచారించాలని కోర్టును కోరింది. దీంతో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అసహనంతో పై వ్యాఖ్యలు చేశారు.

## పట్టు, తోలు వస్తువులు కొనను

### నా కూతురు కోరికతో శాకాహారిగా మారాను
### సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6: తన కూతురు కోరిక మేరకు తాను శాకాహారిగా మారినట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఢిల్లీలో హైకోర్టులో డిజిటల్ న్యాయ నివేదికల ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'నాకు ప్రియాంక, మహి అని ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారు దివ్యాంగులు. వారే నన్ను శాకాహారిగా మార్చారు. నేను, నా భార్య పట్టు, తోలు వస్తువులు కూడా కొనుగోలు చేయం' అని తెలిపారు. కాగా, 2015లో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్నప్పుడు ఉత్తరాఖండ్‌కు చెందిన ఇద్దరు దివ్యాంగ బాలికలను జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు దత్తత తీసుకున్నారు.

## ఐఐటీ మద్రాస్‌కు రూ.228 కోట్ల విరాళం

### పూర్వ విద్యార్థి కృష్ణ చివుకుల ఉదారత



చెన్నై, ఆగస్టు 6: ఐఐటీ మద్రాస్‌కు ఓ పూర్వ విద్యార్థి భారీ విరాళం అందజేశారు. 1970 ఎంటెక్ ఎయిరో స్పేస్ ఇంజినీరింగ్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ కృష్ణ చివుకుల రూ.228 కోట్ల విరాళం ప్రకటించారు. దేశ చరిత్రలో ఒక విద్యా సంస్థకు ఇంత పెద్ద మొత్తంలో విరాళం లభించడం ఇదే మొదటిసారి. కృష్ణ అందించిన విరాళానికి గుర్తింపుగా ఐఐటీలోని ఒక అకడమిక్ బ్లాక్‌కు ఆయన పేరు పెట్టారు. మంగళవారం జరిగిన ఈ నామకరణోత్సవానికి కృష్ణ చివుకుల, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ భారీ విరాళాన్ని విదేశీ విద్యార్థుల ఉపకార వేతనాలు, పరిశోధనలు, అండర్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లు తదితరాలకు ఉపయోగించనున్నారు. ఐఐటీ మద్రాస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.513 కోట్ల నిధులను సేకరించగలిగింది. ఇందులో పూర్వ విద్యార్థుల నుంచే అత్యధికంగా రూ.367 కోట్లు అందాయి.



## బ్రిటన్ ఫ్యామిలీ వీసా నిబంధన సడలింపు

- వార్షిక ఆదాయం 41 లక్షలు అక్కర్లేదు
- స్టార్మర్ ప్రభుత్వం నిర్ణయం.. భారతీయులకు లబ్ధి

లండన్: బ్రిటన్‌లో కొత్తగా ఏర్పడ్డ అధికార లేబర్ పార్టీ అక్కడి భారతీయులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. తమ బంధువులను కుటుంబ వీసాపై బ్రిటన్‌కు తీసుకొచ్చేందుకు ఉన్న నిబంధనలపై కొత్త ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వార్షిక ఆదాయ పరిమితిని పెంచుతూ రిషి సునాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పక్కన పెట్టింది. దీంతో బ్రిటన్‌లో శాశ్వత నివాస హోదా కలిగిన ప్రవాస భారతీయులకు భారీ ఊరట లభించింది. వీరి కుటుంబ ఆదాయ పరిమితిని 29 వేల పౌండ్ల నుంచి 38 వేల పౌండ్ల(రూ.41.5లక్షలు)కు రిషి సునాక్ ప్రభుత్వం పెంచగా, ఈ నిబంధనను అధికార లేబర్ పార్టీ పక్కనపెట్టింది. ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా పక్కన పెడుతున్నామని బ్రిటన్ హోం మంత్రి యెవెట్ కూపర్ పేర్కొన్నారు. ఈ విధానాన్ని వలసవాద సలహా కమిటీతో సమీక్షించనున్నారు.

## విద్యుత్తును ఉత్పత్తి చేసే బూట్లు

- రియల్-టైమ్ లొకేషన్‌ను కూడా చెప్తాయట
- సైనికుల కోసం డిజైన్ చేసిన ఇండోర్ ఐఐటీ



ఇండోర్, ఆగస్టు 6: సాయుధ బలగాల సిబ్బంది భద్రతను, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ప్రత్యేకమైన బూట్లను తయారు చేసింది. విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే టెక్నాలజీతో కూడిన ఈ బూట్లను ధరించడం ద్వారా సైనికులు తామున్న రియల్ టైమ్ లొకేషన్‌ను తెలుసుకునేందుకు కూడా వీలవుతుందని అధికారులు మంగళవారం వెల్లడించారు. తొలి బ్యాచ్‌లో తయారు చేసిన 10 జతల బూట్లను ఇప్పటికే రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు పంపినట్టు ఇండోర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుహాస్ జోషి తెలిపారు. ప్రొఫెసర్ ఐఏ పళని మార్గదర్శకత్వంలో ప్రయోగాత్మకంగా ఈ బూట్లను తయారు చేసినట్టు చెప్పారు. ట్రైబో-ఎలక్ట్రిక్ నానోజెనరేటర్ (టీఈఎన్‌జీ) టెక్నాలజీతో కూడిన ఈ బూట్లు ప్రతి అడుగుకూ విద్యుత్తును ఉత్పత్తి చేయగలవని, ఆ బూట్ల అడుగు భాగం (సోల్)లోని డివైజ్‌లో నిల్వ చేసుకోగలిగే ఆ విద్యుత్తుతో చిన్న చిన్న పరికరాలను ఆపరేట్ చేసుకోవచ్చని వివరించారు. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్), రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్‌ఐడీ) సాంకేతికతలను కలిగి ఉండే ఈ బూట్లను ధరించడం ద్వారా సైనికులు తమ రియల్ టైమ్ లొకేషన్‌ను కూడా తెలుసుకోవచ్చని, అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ సిటిజన్లు (వృద్ధులు), విద్యార్థులు, పర్వతారోహకులకు సైతం ఈ బూట్లు ఎంతో ఉపకరిస్తాయని ప్రొఫెసర్ సుహాస్ జోషి తెలిపారు.

## ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగితే రక్తపోటు!

న్యూఢిల్లీ, ఆగస్టు 6: ప్లాస్టిక్ బాటిల్ నీళ్లను తాగితే రక్తపోటు వచ్చే ముప్పు పెరుగుతుందని ఆస్ట్రియాకు చెందిన 'డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ' పరిశోధకులు తేల్చారు. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం ఆపేసి, రెండు వారాల పాటు పంపు నీటిని తాగిన వారిలో రక్తపోటు తగ్గుదల కనిపించిందని పరిశోధకులు వివరించారు. 'జర్నల్ మైక్రోప్లాస్టిక్స్' వార్తా కథనం ప్రకారం, మనం తాగే నీళ్లలో, ఆహార పదార్థాల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. దీనికి కారణం.. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం,



ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేసిన ఆహారాన్ని తినటం. అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ కణాలు (5 మిల్లీమీటర్ల పొడవు).. పేగులు, ఊపిరితిత్తులు, రక్తనాళాల్లోకి చేరుతున్నాయని, దీంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అధ్యయనం తెలిపింది.

## అద్వానీకి అస్వస్థత

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ(96) మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఢిల్లీలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గత నెల మొదటి వారంలో కూడా ఆయన రెండు రోజుల పాటు దవాఖానలో వైద్యుల పరిశీలనలో ఉన్నారు. అంతకుముందు ఎయిమ్స్‌లోనూ ఆయన చికిత్స పొందారు.



## రాష్ట్రపతి ముర్ముకు ఫిజి అత్యున్నత పౌర పురస్కారం



సువా (ఫిజి), ఆగస్టు 6: పసిఫిక్ దేశాల్లో పర్యటిస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మంగళవారం ఫిజి దేశపు అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజి' పురస్కారాన్ని ఆ దేశ ప్రభుత్వం రాష్ట్రపతికి ప్రదానం చేసింది. ఇక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఫిజి అధ్యక్షుడు రటు విలియమే మైవాలిలి కటోనివెరె చేతుల మీదుగా రాష్ట్రపతి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రెండు రోజుల ఫిజి పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ముర్ము, మంగళవారం ఫిజి పార్లమెంట్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను ప్రస్తుతించారు.

## డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్

### ఎంపిక చేసుకున్న కమలా హారిస్

వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను(60) ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని కమలా హారిస్ మంగళవారం ఎంపిక చేసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన మధ్య పశ్చిమ ఎగువ ప్రాంతంలో ఉధృతంగా ప్రచారం చేయాలని హారిస్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన సైనిక వ్యవహారాల అనుభవజ్ఞుడు, తన సొంత రాష్ట్రంలో డెమొక్రటిక్ పార్టీ అజెండాను అమలు చేయడంలో కీలకంగా వ్యవహరించిన వాల్జ్‌ను తన 'రన్నింగ్ మేట్'గా హారిస్ వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు.

## ముగిసిన ఎన్‌సీడబ్ల్యూ చీఫ్ రేఖాశర్మ పదవీకాలం

న్యూఢిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్‌గా రేఖా శర్మ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఆమె తన పదవి నుంచి తప్పుకున్నారు. 2018 ఆగస్టు 7న ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె, ఆ పదవిలో 7 ఏండ్లు కొనసాగారు. మూడు టర్మ్‌లు చైర్‌పర్సన్‌గా పనిచేయటం తనకెంతో గర్వకారణమని, సుదీర్ఘకాలం కమిషన్‌లో పనిచేసిన తాను ఇక్కడి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు రేఖా శర్మ చెప్పారు. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా రేఖా శర్మ హయాంలో, మణిపూర్‌లో మహిళలపై లైంగికదాడులు, హత్యలపై ఎన్‌సీడబ్ల్యూ పెద్దగా స్పందించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి.

## సూరత్‌లో డైమండ్ సంక్షోభం!

- డిమాండ్ లేక 50 వేల మంది ఉద్యోగులకు వెకేషన్
- ప్రకటించిన డైమండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ



సూరత్: గుజరాత్‌లో డైమండ్ పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మాంద్యం కారణంగా పాలిష్డ్ డైమండ్‌లకు డిమాండ్ లేకపోవడంతో సూరత్‌కు చెందిన ఓ డైమండ్ మాన్యుఫాక్షరింగ్ సంస్థ 50 వేల మంది ఉద్యోగులకు 10 రోజుల వెకేషన్ ప్రకటించింది. 'ఈ నెల 17 నుంచి 27 వరకు 50 వేల మంది మా ఉద్యోగులకు వెకేషన్ ప్రకటించాం. కొంత మొత్తం తగ్గించినా, ఈ వ్యవధికి ఉద్యోగులకు వేతనం అందజేస్తాం. మాంద్యం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. మాంద్యంతో నేను అలసిపోయా' అని కిరణ్ జెమ్స్ కంపెనీ చైర్మన్ వల్లభ్ బాయ్ లఖాని తెలిపారు. ఇతర సంస్థలు కూడా ప్రభావితమైనప్పటికీ అవి సైలెంట్‌గా ఉన్నాయని, ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియాలనే తాము ముందుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తమ ఉత్పత్తిని క్రమబద్ధీకరించేందుకు వెకేషన్ నిర్ణయం దోహదపడుతుందన్నారు. ఈ మాంద్యం వెనుక ఉన్న కారణం ఎవరికీ తెలియదన్నారు. 95 శాతం పాలిష్డ్ డైమండ్లు ఎగుమతి అవుతున్న నేపథ్యంలో, వీటి అమ్మకాలపై అంతర్జాతీయ పరిణామాలు ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధాలు కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా చెప్పారు. సూరత్‌లోని 4 వేల డైమండ్ పాలిషింగ్ కంపెనీలు దాదాపు 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులకు వెకేషన్ కారణంగా ఉత్పత్తి తగ్గి, డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

## 'వడ్డీ పంచాయితీ'లో ఏసీపీ జోక్యం

- వ్యాపారులను బెదిరించి రూ.30 లక్షలు వసూలు
- బాధితుడికి అప్పగించకుండా ముప్పతిప్పలు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఏసీపీ వ్యవహారం

వినాయక్‌నగర్, ఆగస్టు 6: వడ్డీ పంచాయితీలో ఓ ఏసీపీ జోక్యం చేసుకొని బాధితుడికి ఇవ్వాల్సిన రూ.30 లక్షలు తన వద్దే ఉంచుకున్నాడు. బాధితుడికి ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. దీంతో బాధితుడు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు ఏసీపీ దారిలోకి వచ్చి తిరిగి చెల్లించాడు. జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీకి చెందిన ఓ వ్యాపారి తన బిజినెస్ కోసం రూ.నాలుగు కోట్లు అవసరం ఉండడంతో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిని ఆశ్రయించాడు. దీంతో సదరు వ్యక్తి ఐదు నెలల క్రితం త్రీటౌన్ పరిధిలో ఉన్న వడ్డీ వ్యాపారస్తుల వద్దకు ఏపీ వ్యాపారిని తీసుకువచ్చాడు. వడ్డీ వ్యాపారులతో మాట్లాడించగా.. వారు రూ. 4కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అయితే తాము అంతమొత్తంలో ఇవ్వాలంటే ష్యూరిటీగా ముందు తమకు రూ.60 లక్షలు ఇవ్వాలని ఆంధ్రవ్యాపారికి కండిషన్ పెట్టారు. దీనికి అతడు అంగీకరించి రూ.60లక్షలు వడ్డీ వ్యాపారులకు చెల్లించాడు. తమకు కొంత సమయం ఇస్తే రూ. నాలుగు కోట్లు ఇస్తామని వ్యాపారిని వడ్డీ వ్యాపారులు నమ్మించారు. ఐదు నెలలుగా ఆంధ్ర వ్యాపారి డబ్బుల కోసం వారి చుట్టూ చక్కర్లు కొట్టినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో సదరు వ్యాపారి తనకున్న పరిచయస్తుల ద్వారా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ప్రత్యేక బృందం ఏసీపీని ఆశ్రయించాడు. పూర్తి వివరాలు తెలుసుకున్న సదరు ఏసీపీ.. వడ్డీ వ్యాపారులను బెదిరించి రూ.30 లక్షలు వసూలుచేశాడు. ఆ డబ్బులు ఏపీ వ్యాపారికి ఇవ్వకుండా తన వద్దే ఉంచుకొని ముప్పుతిప్పలు పెట్టసాగాడు. దీంతో బాధితుడు హైదరాబాద్‌లో ఓ పోలీస్ ఉన్నతాధికారిని కలిసి ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు ఉన్నతాధికారి నుంచి జిల్లా బాస్‌కు ఫోన్ రాగా..ఇక్కడి ఏసీపీ వ్యవహారం మొత్తం వివరించారు. సీపీ వెంటనే రూ.30 లక్షలు తీసుకున్న ఏసీపీపై మండిపడినట్లు సమాచారం. ఈ కేసును నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డికి అప్పగించారు. వెంటనే ఆయన రంగంలోకి దిగి ఏసీపీని విచారించి అతడి నుంచి రూ.30 లక్షలు తిరిగి వసూలు చేసి బాధితుడికి అప్పగించారు. తన వద్ద నుంచి రూ.60లక్షలు తీసుకున్న వడ్డీ వ్యాపారులపై బాధితుడు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఐదుగురు వడ్డీ వ్యాపారుల పై పది రోజుల క్రితం కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

## తల్లిదండ్రులకు విద్యార్థి అప్పగింత

శక్కర్‌నగర్, ఆగస్టు 6: బోధన్ పట్టణంలో గత నెల 26వ తేదీన అదృశ్యమైన ఇందూర్ హైస్కూల్ విద్యార్థి పది రోజుల అనంతరం దొరికాడని స్థానిక పోలీసులు తెలిపారు. ఇందూర్ హైస్కూల్ కరెస్పాండెంట్ కొడాలి కిశోర్ పోలీసులతో కలిసి పలు ప్రాంతాల్లో గాలించారని, హైదరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో సీసీ పుటేజీ ఆధారంగా విద్యార్థి తిరుమలలో ఉన్నట్లు గుర్తించారని అన్నారు. కరెస్పాండెంట్ కిశోర్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, రవి వెళ్లి విద్యార్థిని బోధన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరయ్య విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు.

## నేడు ఎస్సారెస్పీ నీటి విడుదల



### హాజరుకానున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, ఆగస్టు6: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి బుధవారం కాకతీయ, సరస్వతీ, లక్ష్మి కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై నీటిని విడుదల చేయనున్నారు. శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని వానాకాలం పంటలకు సాగునీటిని అందించాలనే ప్రణాళికపై తెలంగాణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక కమిటీ సమావేశమై బుధవారం నుంచి నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నదని అధికారులు తెలిపారు. వారబందీ ప్రకారం ఈనీటి విడుదల కొనసాగనున్నది. లక్ష్మి కాలువకు 350 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. వారబందీ ప్రకారం కాకతీయ కాలువకు ఏడురోజులు మూడు వేల క్యూసెక్కులు, ఎనిమిదో రోజు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4.60 లక్షల ఎకరాలకు, సరస్వతీకాలువ ద్వారా 35వేల ఎకరాలకు, లక్ష్మీకాలువ ద్వారా 25వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని అధికారులు నిర్ణయించారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 38వేలు, అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా 57వేలు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల ద్వారా 11వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లోకి ఈసారి ఎగువ నుంచి వరద తక్కువగా రావడంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఆశించిన స్థాయికి చేరుకోలేదు. శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతానికి వానాకాలం పంటకు సాగునీటిని అందించాలంటే ప్రాజెక్ట్‌లోకి కనీసం 56 టీఎంసీలు నీరువచ్చి చేరాలి. కానీ మంగళవారం నాటికి 46.057 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వానాకాలం పంటలకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో అధికారులు నీటి విడుదలకు నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద**

ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతం నుంచి క్రమంగా వరద తగ్గుతోంది. మంగళవారం ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 9971క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5) టీఎంసీలు కాగా, మంగళవారం ప్రాజెక్ట్‌లో 1080.4అడుగులు (46.057టీఎంసీలు) నీటి నిల్వ ఉంది.

## యువతి చెయ్యి లాగిన బాలుడు

### మతిస్థిమితం లేదని చెప్పిన పోలీసులు

వినాయక్‌నగర్, ఆగస్టు 6: షాపింగ్‌మాల్‌లోని లిఫ్ట్‌లో వస్తున్న యువతి చెయ్యిపట్టుకొని బాలుడు లాగిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. హైదరాబాద్ రోడ్డులోఉన్న షాపింగ్‌మాల్‌లో పనిచేసే యువతి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు లిఫ్ట్‌లో పైనుంచి కిందికి వస్తుండగా.. అక్కడే ఉన్న బాలుడు ఆమె చెయ్యి పట్టుకొని లాగాడు. సమాచారం అందుకున్న నగర సీఐ నరహరి, నాల్గో టౌన్ ఎస్సై అక్కడికి చేరుకొన్నారు. విచారణ చేపట్టగా.. సదరు బాలుడికి మతిస్థిమితం లేదని అక్కడివారు చెప్పారని పోలీసులు తెలిపారు.

## పచ్చదనంతోనే మన మనుగడ



కొత్తాబాది గ్రామంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- కేసీఆర్ సహకారం మరువలేను
- ఆయన వల్లే నెరవేరిన పేదల సొంతింటి కల
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, ఆగస్టు 6: పచ్చదనంతోనే మానవ మనుగడ సాగుతుందని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్‌లో ఆయన మొక్కను నాటారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. అడవులను రక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అడవులను నరికితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**కేసీఆర్ సహకారం మరచిపోలేను..**

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ అందించిన సహకారం మరిచిపోలేనని పోచారం అన్నారు. నిరుపేదల సొంతింటి కలను కేసీఆర్ కృషితోనే సాకారం చేశానని, 11 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయించానన్నారు. మేలు చేసిన వ్యక్తులను గుర్తుచేసుకోవాలని పోచారం అన్నారు. ఇప్పటివరకు రూ.500 కోట్ల బిల్లులను చెల్లించామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఇటీవలే రూ.8 కోట్ల ఇండ్ల బిల్లులు ఇచ్చామని, మిగిలిన రూ.12 కోట్లను త్వరలోనే అందిస్తామన్నారు. బిల్లుల విడుదలకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, తానే స్వయంగా కొత్తాబాది గ్రామానికి వచ్చి లబ్ధిదారులకు ఇండ్ల బిల్లులు అందిస్తానని చెప్పారన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కాదు.. తీసుకెళ్లింది పోలీసులే...



బీపీఎం సాయినాథ్‌ను తీసుకెళ్తున్న కార్ఖానా పోలీసులు

బాన్సువాడ, ఆగస్టు 6: కామారెడ్డి జిల్లా బాన్సువాడలో బ్రాంచ్ పోస్టుమాస్టర్ కిడ్నాప్ కథ సుఖాంతమయ్యింది. బుడ్మి బీపీఎం సాయినాథ్‌ను హైదరాబాద్‌లోని కార్ఖానా పోలీసులు ఓ కేసు విషయమై విచారణకు తీసుకెళ్లినట్లు స్థానిక పోలీసులు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పోలీసులు, బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. బాన్సువాడ మండలంలోని కోనాపూర్‌కు చెందిన అరికె సాయినాథ్ స్థానిక పోస్టాఫీస్‌లో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. బాన్సువాడలోని టీచర్స్ కాలనీలో నివాసముండే ఆయన ఇంటికి మంగళవారం ఉదయం 8.45 గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి సాయినాథ్‌ను తీసుకెళ్లారు. దీంతో భయాందోళనకు గురైన భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మెడపై చేయివేసి లాక్కెళ్లారని, ఆయనను రక్షించాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ పుటేజ్‌ను పరిశీలించారు. సొంతూరు కోనాపూర్, విధులు నిర్వహించే బుడ్మి గ్రామాల్లో సాయినాథ్‌కు సన్నిహితంగా ఉండే వ్యక్తులను ఆరా తీసే పనుల్లో నిమగ్నమయ్యారు. చివరికి సాయినాథ్‌ను కిడ్నాప్ చేయలేదని, హైదరాబాద్‌లోని కార్ఖానా పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ, చీటింగ్ కేసు విచారణలో భాగంగా తీసుకెళ్లినట్లు పట్టణ సీఐ మున్నూరు కృష్ణ సాయంత్రం వెల్లడించారు.

## తమ్ముడి చేతిలో అన్న హతం

### బాన్సువాడ పట్టణంలో ఘటన

బాన్సువాడ, ఆగస్టు 6 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. దాల్‌మాల్ గుట్టలో అన్నను బట్టలు కత్తిరించే కత్తెరతో పొడిచి హత్య చేసినట్లు పట్టణ సీఐ కృష్ణ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దాల్‌మాల్ గుట్టకు చెందిన బకిలిగారి గంగామణికి ముగ్గురు కుమారులు. ఆమె ఫారెస్ట్ ఆఫీస్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నది. పెద్ద కుమారుడు కృష్ణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే కృష్ణ మేస్త్రీ పనికి వెళ్లి ఇంటికి వచ్చాడు. కాళ్లు, చేతులు కడుక్కోవడానికి గచ్చులోకి వెళ్లగా.. చీకటి ఉందని లైట్ వేయాలని తమ్ముడు రాజుకు సూచించాడు. తాను తన భార్యతో కలిసి అన్నం తింటున్నానని, తిన్న తర్వాత లైట్ వేస్తానని సమాధానమిచ్చాడు. అయినా వినకుండా గట్టిగా అరుస్తూ తలుపులు తట్టడంతో చిన్న కుమారుడు రాజు తల్లికి ఫోన్ చేశాడు. తల్లి అక్కడికి వచ్చేసరికి చిన్న కుమారుడు తలుపులు తీసి, బూతుమాటలు తిడుతూ, బట్టలు కత్తిరించే కత్తెరతో అన్న కృష్ణ మెడ, ఎడమ చేయిపై పొడిచాడు. గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్స్‌లో వెంటనే బాన్సువాడ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యుడు.. కృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

